క్లుప్తంగా

రీ సర్వేను పరిశీలించిన డిప్యూటీ కలెక్టర్

మద్దిపాడు: మండలంలోని కొలచనకోట గ్రామంలో జరుగుతున్న రీ సర్వేను డిప్యూటీ కలెక్టర్ వరకుమార్ శనివారం పరిశీలించారు. రైతులకు నోటీసులిచ్చిన అనంతరమే రీ సర్వే చేపట్టాలని సూచించారు. ఎటువంటి పరిస్థితుల్లోనూ జాయింట్ ఎల్పీఎంలు ఇవ్వరాదన్నారు. ప్రతి రైతుకు ఒక ఎల్పీఎం నంబర్ ఇవ్వాలని ఆదేశించారు. అనంతరం సర్వేయర్లకు పలు సలహాలు, సూచనలు చేశారు. తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్వోలతో సమావేశమయ్యారు. గ్రామాల్లో రెవెన్యూ పరమైన సమస్యలు పరిష్కరిస్తూ రీ సర్వేలలో వచ్చిన అర్జీలను పరిష్కరించడంలో అలసత్వం వహించకుండా పనిచేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో మద్దిపాడు తహసీల్దార్ సుజన్‌కుమార్, ఆర్ఐ రమణయ్య, డిప్యూటీ తహసీల్దార్ అజయ్‌కుమార్‌రెడ్డి, మండల సర్వేయర్ ఆంజనేయదేవి, రెవెన్యూ సిబ్బంది, సర్వే సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాల్లో పారిశుధ్యం ప్రధానం

మద్దిపాడు: మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలలో పారిశుధ్యానికి ప్రాధాన్యత ఇవ్వాలని ఎంపీడీవో ఎస్వీ ప్రసాద్ పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. శనివారం మండల పరిధిలోని వెల్లంపల్లి గ్రామంలో నిర్వహిస్తున్న పారిశుధ్య పనులను ఆయన పరిశీలించారు. గ్రామ పంచాయతీ, గ్రామ సచివాలయం పరిధిలో నిర్వహించే పారిశుధ్య పనులకు సచివాలయ ఉద్యోగులు కూడా సహకరించాలని సూచించారు. వెల్లంపల్లి గ్రామంలోని రాజులమిట్ట వద్ద ఉన్న ఎస్‌డబ్ల్యూపీసీని సందర్శించారు. ఎస్‌డబ్ల్యూపీసీ పరిస్థితి గురించి పంచాయతీ కార్యదర్శి బి.మాధవిని అడిగి తెలుసుకున్నారు. ఎస్‌డబ్ల్యూపీసీ నిర్మాణం జరుగుతున్న స్థలం వివాదంలో ఉందని, హైకోర్టులో కేసు నడుస్తోందని ఎంపీడీవో దృష్టికి ఆమె తీసుకెళ్లారు. దీనిపై సమగ్రంగా సమాచారం తీసుకుని తదుపరి చర్యలు తీసుకోనున్నట్లు ఎంపీడీవో తెలిపారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి బి.మాధవి, వెటర్నరీ అసిస్టెంట్ నరసింహారావు, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

దివ్యాంగులను ఆదుకోవడం ప్రతిఒక్కరి బాధ్యత

- దివ్యాంగుల శాఖ ఏడీ అర్చన


దివ్యాంగులకు నిత్యావసర వస్తువులు అందిస్తున్న ఆ శాఖ ఏడీ అర్చన, మహబూబ్

ఒంగోలు టౌన్: దివ్యాంగులను ఆదుకోవడం ప్రతిఒక్కరి బాధ్యతని దివ్యాంగుల శాఖ ఏడీ అర్చన అన్నారు. శనివారం ఒంగోలు నగరంలోని సంతపేటలో గల దివ్యాంగుల హాస్టల్లో దోస్తీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిత్యావసర వస్తువులు, పండ్లు పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న అర్చన మాట్లాడుతూ ప్రభుత్వంతో పాటుగా పలు స్వచ్ఛంద సంస్థల చేయూతతోనే దివ్యాంగులకు న్యాయం జరుగుతుందన్నారు. క్రమం తప్పకుండా దివ్యాంగులకు సాయం చేస్తున్న దోస్తీ ఫౌండేషన్ సేవలను కొనియాడారు. ఫౌండేషన్ చైర్మన్, మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ షేక్ మహబూబ్ మాట్లాడుతూ నగరంలోని వృద్ధాశ్రమాలు, అనాథాశ్రమాలతో పాటుగా దివ్యాంగులకు కూడా తమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సేవలందిస్తున్నట్లు తెలిపారు. నెల రోజులకు సరిపడా బియ్యం, ఇతర సరుకులను దివ్యాంగుల హాస్టల్‌కు అందిస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో నత్తల శ్రీనివాసరావు, ఎం.సుబ్బారావు, దివ్యాంగుల హాస్టల్ నిర్వాహకులు శివకృష్ణారెడ్డి, రమణయ్య, కృష్ణ యాదవ్‌పాల్గొన్నారు.

నేరాలపై అప్రమత్తంగా ఉండండి


ప్రభుత్వ బాలికల హాస్టల్లో అవగాహన కల్పిస్తున్న సీఐ సుబ్బారావు

చీమకుర్తి: సమాజంలో జరిగే నేరాలపై అప్రమత్తంగా ఉండాలని చీమకుర్తి సీఐ ఎం.సుబ్బారావు విద్యార్థులకు సూచించారు. మహిళలు, బాలికలపై వేధింపుల పట్ల అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో శనివారం స్థానిక ప్రభుత్వ బాలికల హాస్టల్, బీవీఎస్ఆర్ ఇంజినీరింగ్ కాలేజీలలోని విద్యార్థులతో మాట్లాడారు. నేరాల పట్ల అప్రమత్తంగా ఎలా ఉండాలో వివరించారు. రోడ్డు భద్రత విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.


బీవీఎస్ఆర్ ఇంజినీరింగ్ కాలేజీలో మాట్లాడుతున్న సీఐ, పాల్గొన్న విద్యార్థులు

గడ్డికి గడ్డు కాలం..!


ఎడ్లబండిపై తీసుకెళ్తున్న వరిగడ్డి


అమ్మకానికి సిద్ధంగా ఉన్న వరిగడ్డి

- ఒక మోపు గడ్డి ధర రూ.350 నుంచి రూ.400
- పశుపోషకులకు అందుబాటులో లేని పశుగ్రాసం
- పేరుకే పశుగ్రాస క్షేత్రాలు
- పశుపోషకులకు వర్తించని వైనం
- కొత్తపట్నం మండలంలో ప్రశ్నార్థకంగా పాడిపరిశ్రమ
- ఇలాగైతే కష్టమంటున్న డెయిరీ ఫాం యజమానులు

కొత్తపట్నం:

గ్రామీణ ప్రాంతంలో వ్యవసాయం తర్వాత పాడిపరిశ్రమపైనే ఆధారపడి సగం మంది జీవిస్తుంటారు. పొలం లేని వారు, ఉపాధి లేని వారు గేదెలు మేపుకుని పొట్టనింపుకుంటుంటారు. అయితే, ఈ ఏడాది గడ్డి ధరలు విపరీతంగా పెరగడంతో వారంతా అల్లాడుతున్నారు. పశుగ్రాసం కొరతతో కొత్తపట్నం మండలంలో పాడి పరిశ్రమ పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. పాడి గేదెలను అమ్ముకోవాలో.. ఉంచుకోవాలా తెలియని స్థితిలో పశుపోషకులు అల్లాడుతున్నారు. కొత్తపట్నం మండలంలో 11,850 గేదెలు, ఆవులు, దూడలు ఉన్నాయి. వీటికి ఏడాదికి వరిగడ్డి స్టాక్ చేసుకోవాలంటే ఒక్కో గేదెకు 150 మోపుల చొప్పు గడ్డి కావాలి. ఈ ఏడాది పంటలు పండినప్పటికీ గడ్డి మోపు ధర రూ.350 నుంచి రూ.400 వరకూ పలుకుతోంది. దీంతో కొంత మంది పశుపోషకులు గడ్డి కొనుగోలు చేయలేక గేదెలను అమ్ముకుంటున్నారు.

పశుపోషక క్షేత్రాలు, పథకం ఉన్నప్పటికీ నిరుపయోగం...

ప్రభుత్వ పశుపోషక క్షేత్రాలు ఉన్నప్పటికీ రైతులకు ఉపయోగపడటం లేదు. ప్రభుత్వం, అధికారుల నిర్లక్ష్యం కారణంగా అవన్నీ మాటలకే పరిమితం అయ్యాయి. ప్రభుత్వమే రైతుల వద్ద గడ్డి కొనుగోలు చేసి పశుపోషకులకు ఇస్తే ఉపయోగకరంగా ఉంటుందని పలువురు రైతులు సూచిస్తున్నారు. కానీ, ఆ దిశగా చర్యలు తీసుకునే వారు కరువయ్యారు. కొత్తపట్నం మండలంలో 11,850 పశువులుంటే ఒక్క రైతుకు కూడా పశుపోషక క్షేత్రం ఉపయోగపడటంలేదు. పశువులున్న రైతుకు భూమి ఉండాలి.. అందులో బోరు ఉండాలి.. రెండూ లేకపోతే పశుపోషకక్షేత్రం వర్తించదు. అల్లూరు గ్రామంలో పొలాలున్నాయి గానీ.. ఒక్క రైతుకూ బోరు లేదు. అవన్నీ గ్రౌండ్ వాటర్ లేని మెట్ట పొలాలే. అందువలన పశుపోషక క్షేత్రం పథకం వర్తించడంలేదు. కొత్తపట్నం, ఈతముక్కల పశువైద్యశాలల పరిధిలో ఒక్క రైతు కూడా పశుపోషక క్షేత్రాలకు దరఖాస్తు చేసుకోలేదు. ప్రభుత్వం చర్యలు తీసుకుని పశుగ్రాసాన్ని రైతు దగ్గర కొనుగోలు చేసి పశుపోషకులకు ఇస్తే వారికి ఉపయోగపడుతుందని రైతులు కోరుతున్నారు.

గడ్డి ధర పెరగడంతో పశువులను తగ్గించుకున్నా :



నాకు సెంటు భూమి కూడా లేదు. పశువులపైనే నా కుటుంబం ఆధారపడి జీవిస్తుంది. గతంలో 9 గేదెలు ఉండేవి. గడ్డి మోపు ధర రూ.350 నుంచి రూ.400కు పెరగడంతో 4 గేదెలు అమ్మేశాను. గడ్డి ధర పెరగడం వలన మాకు వచ్చే లాభం ఆ గడ్డికే సరిపోతుంది. ప్రభుత్వం మాకు ఎటువంటి సబ్సిడీ పథకాలు ఇవ్వడంలేదు. పశుగ్రాసం గురించి ప్రభుత్వం ఆలోచించాలి. రైతుల దగ్గర కొనుగోలు చేసి ఇవ్వాలి.

నీలం వెంకటేశ్వరమ్మ, కొత్తపట్నం

పశుగ్రాసాన్ని రైతుల దగ్గర కొనుగోలు చేసివ్వాలి :



ప్రభుత్వం పశుగ్రాస క్షేత్రాలు పెట్టిందిగానీ ఒక్క రైతుకూ ఉపయోగపడటంలేదు. ఒక్కరికి కూడా ఈ పథకం వర్తించడంలేదు. పొలం ఉంటే బోర్లు ఉండవు. గేదెలు ఉంటే పొలం ఉండదు. ఇటువంటి పరిస్థితుల్లో ఆ పథకం ఎందుకూ ఉపయోగపడటం లేదు. రైతు పండించే గడ్డిని గేదెలు మేపుకునే పశుపోషకులకు ప్రభుత్వమే కొనుగోలు చేసివ్వాలని కోరుకుంటున్నాం.

గౌరబోయిన శ్రీను, కొత్తపట్నం

పశుపోషక క్షేత్రాలు పెట్టుకుంటే ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా సబ్సిడీ :

పశుపోషక క్షేత్రాలు పెట్టుకోవడానికి రైతులెవ్వరూ ముందుకు రావడం లేదు. ఇప్పటికీ వాటికి అవకాశం ఉంది. అయితే, పొలం ఉండాలి, పొలంలో బోర్లు తప్పనిసరిగా ఉండాలి. అలా ఉన్న వారు పశుపోషక క్షేత్రాలు పెట్టుకుంటే ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా సబ్సిడీ వస్తుంది.

శోభ, అనూష, అల్లూరు, కొత్తపట్నం, పశువైద్యాధికారులు

న్యాయ సేవలను వినియోగించుకోవాలి

సంతనూతలపాడు: ప్రకాశం జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఏ భారతి, స్టేట్ లీగల్ సర్వీస్ అథారిటీ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న ప్రత్యేక న్యాయ సేవా కార్యక్రమాలను వినియోగించుకోవాలని కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ (సీహెచ్‌వో) ఆర్.ప్రసాద్ పిలుపునిచ్చారు. సంతనూతలపాడు మండలంలో 15 రోజుల పాటు దివ్యాంగుల సంక్షేమం కోసం ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమాలలో భాగంగా శనివారం సాయంత్రం మైనంపాడు గ్రామంలో దివ్యాంగులు, వారి తల్లిదండ్రులు, ఆరోగ్యశాఖ, మహిళా శిశు సంక్షేమ శాఖ ఉద్యోగులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లా లోక్ అదాలత్ స్టాండింగ్ కౌన్సిల్ అడ్వకేట్ డాక్టర్ నూకతోటి రవికుమార్ నేతృత్వంలో నిర్వహించిన ఈ సమావేశంలో సీహెచ్ఓ ఆర్.ప్రసాద్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. అనంతరం స్టాండింగ్ కౌన్సిల్ న్యాయవాది రవికుమార్ మాట్లాడుతూ దివ్యాంగుల కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అదేవిధంగా పరిసరాల పరిశుభ్రత పాటించాలని, బాల్యవివాహాల వలన వచ్చే అనర్థాల గురించి తల్లిదండ్రులకు తెలియజేయాలని కోరారు. కార్యక్రమంలో న్యాయసేవాధికార సంస్థ పారాలీగల్ వలంటీర్ పాటిబండ్ల సతీష్, ఏఎన్ఎం కె.నాగలక్ష్మి, అంగన్‌వాడీ టీచర్లు సౌజన్య, అనూరాధ, ఆశా వర్కర్లు, తల్లులు పాల్గొన్నారు.


మైనంపాడులో ప్రచారం చేస్తున్న సీహెచ్‌వో ప్రసాద్, అడ్వకేట్ రవికుమార్


సంకువారిగుంటలో మంచానికి పరిమితమైన వికలాంగులను గుర్తిస్తున్న టీం సభ్యులు

పిల్లలు, వికలాంగుల సంక్షేమం కోసం ఇంటింటి పర్యటన...

సంకువారిగుంట (కొత్తపట్నం): పిల్లలు, వికలాంగుల సంక్షేమం కోసం ఇంటింటి పర్యటన నిర్వహిస్తూ ప్రచారం చేస్తున్నామని స్టాండింగ్ కౌన్సిల్ అడ్వకేట్ నాయుడు ఈశ్వరరావు తెలిపారు. ఇందు కోసం అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలని జిల్లా జడ్జి ఆదేశాల మేరకు ఈతముక్కల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని సంకువారిగుంట గ్రామంలో శనివారం పర్యటించారు. డాక్టర్ నవ్యరెడ్డి పాల్గొని మాట్లాడుతూ బాల్య వివాహాలు జరగకుండా చూడాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. పిల్లలకు కొన్ని ఆరోగ్య సూత్రాలను అమలు చేయడం ద్వారా వ్యాధులు నివారించవచ్చని తెలిపారు. చర్మవ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. వికలాంగులకు అందుబాటులో ఉన్న చికిత్సలు, సంక్షేమ పథకాల గురించి వివరించారు. పీఎల్‌వీ శింగమనేని ఆంజనేయులు, మురళి, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

గ్రామాలను క్లీన్ అండ్ గ్రీన్‌గా మార్చడమే లక్ష్యం

- సంతనూతలపాడు ఎంపీడీవో సురేష్‌బాబు


సంతనూతలపాడు : ఇంకుడు గుంతల నిర్మాణాన్ని ప్రారంభిస్తున్న ఎంపీడీఓ సురేష్‌బాబు

సంతనూతలపాడు: గ్రామాలను క్లీన్ అండ్ గ్రీన్‌గా మార్చడమే లక్ష్యమని సంతనూతలపాడు ఎంపీడీవో సురేష్‌బాబు అన్నారు. మండలంలోని మైనంపాడు, సంతనూతలపాడు గ్రామాల్లో జరుగుతున్న స్పెషల్ శానిటేషన్ కార్యక్రమాలను మూడో శనివారం సందర్భంగా ఆయన పరిశీలించారు. పంచాయతీ కార్మికులతో ఆయా గ్రామాల్లోని రహదారుల్లో చెత్తాచెదారాన్ని తొలగింపజేసి బ్లీచింగ్ చల్లించారు. ఆయా కార్యక్రమాల్లో పంచాయతీ కార్యదర్శులు పి.రవికుమార్, ఎన్.ప్రతాప్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్ఎస్పీ కార్యాలయ ఆవరణలో...

సంతనూతలపాడులోని ఎస్ఎస్పీ కార్యాలయ ఆవరణలో శనివారం స్వర్ణాంధ్ర, స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా ఉద్యోగులు స్వచ్ఛందంగా క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమం చేపట్టారు. కార్యాలయ ఆవరణను శుభ్రం చేశారు. కార్యక్రమంలో ఎస్ఎస్పీ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఐ.పద్మావతి, ఏఈఈలు ఎస్కే కరీముల్లా, డి.అరుణ, జి.రమణారెడ్డి, కార్యాలయ ప్రతినిధులు టి.శ్రీనివాసరావు, భార్గవ్, ఎస్కే అబ్దుల్ రహీం తదితరులు పాల్గొన్నారు.

ఇంకుడు గుంతల నిర్మాణ ప్రక్రియ ప్రారంభం...

స్వర్ణాంధ్ర, స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా సంతనూతలపాడు మండలంలోని మైనంపాడు, గురవారెడ్డిపాలెం గ్రామాల్లో ఇంకుడు గుంతల నిర్మాణ కార్యక్రమంలో శనివారం సంతనూతలపాడు ఎంపీడీవో డి.సురేష్‌బాబు ప్రారంభించారు. ఎంజీఎన్ఆర్ఈజీఎస్ కింద లబ్ధిదారులను ఎంపిక చేసి ఒక్కొక్క ఇంకుడు గుంతకు రూ.6 వేలు మంజూరు చేయనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో మైనంపాడు ఉప సర్పంచ్ జీ సుబ్బారావు, ఎంపీటీసీ ఏ రాజకుమారి, ఏపీవో వాసంతి, కార్యదర్శులు రవికుమార్, శ్రీనివాసరెడ్డి, ఎన్ఆర్ఈజీఎస్, సచివాలయ సిబ్బంది, లబ్ధిదారులు పాల్గొన్నారు.

ఒంగోలులో ర్యాలీ...

ఒంగోలు వన్‌టౌన్: నగరంలో శనివారం స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర ర్యాలీ నిర్వహించారు. నగరపాలక సంస్థ కార్యాలయం నుంచి కలెక్టరేట్ వరకు నిర్వహించిన ఈ ర్యాలీలో ఏపీ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ నూకసాని బాలాజీ, ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, నగర మేయర్ గంగాడ సుజాత, కమిషనర్ వెంకటేశ్వరరావు, మున్సిపల్ అధికారులు, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

ఇంకుడు గుంతల నిర్మాణ కార్యక్రమం ప్రారంభం

మద్దిపాడు: స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా మండలంలోని ఏడుగుండ్లపాడులో ఇంకుడు గుంతల నిర్మాణ కార్యక్రమాన్ని శనివారం ప్రారంభించారు. స్థానిక సర్పంచ్ శిల్ప సౌందర్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస వరప్రసాద్ పాల్గొని మాట్లాడారు. మండలంలో 347 సోక్‌పిట్లు మంజూరయ్యాయని, ఒక్కో దానికి రూ.6000 చొప్పున ప్రభుత్వం మంజూరు చేస్తుందని తెలిపారు. ఇంకా అర్హులైన వారు ఇంటిదగ్గర మురికినీటిని ఇంకుడు గుంతలో ఇంకింపజేయడానికి ఇంకుడు గుంతలను ఈ కార్యక్రమం ద్వారా నిర్మించుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధి హామీ ఏపీఓ ధనుంజయవర్మ, టెక్నికల్ అసిస్టెంట్ ప్రసాదు, ఫీల్డ్ అసిస్టెంట్ దాసు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

గిరిజన మహిళలపై దాడిచేసిన వారిని అరెస్ట్ చేయాలి


గాయపడిన గిరిజన మహిళలను పరామర్శిస్తున్న ప్రజాసంఘాల నాయకులు

చీమకుర్తి: గిరిజన మహిళలపై దాడిచేసిన నిందితులను వెంటనే అరెస్ట్ చేసి ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. శనివారం చీమకుర్తిలో సీఐ ఎం.సుబ్బారావును కలిసి ఆ మేరకు వినతిపత్రం అందజేశారు. అనంతరం చీమకుర్తి ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న గిరిజన మహిళలను పరామర్శించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ శుక్రవారం రాత్రి బక్కిరెడ్డిపాలెం గ్రామంలో రెడ్డి సామాజిక వర్గానికి చెందిన ఇస్తాలమూడి సుబ్బులుతో పాటు అక్కచెల్లెళ్లు, మరో ఇద్దరు కలిసి గిరిజన కుటుంబాలకు చెందిన కొమరగిరి వెంకటేశ్వరమ్మ, చలంచర్ల దుర్గ, చేవూరి సుబ్బాయమ్మ కళ్లలో కారం కొట్టి కర్రలతో దారుణంగా దాడి చేశారని తెలిపారు. కులం పేరుతో కూడా దూషించారని తెలిపారు. నిజనిర్ధారణ కమిటీగా ఏర్పడిన ప్రజాసంఘాల నాయకులంతా సీఐని కలిసి నిందితులను అరెస్ట్ చేసి వారిపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. గిరిజన మహిళపై దాడి చేయడమే కాకుండా వారిపై తిరిగి కేసు పెట్టారని, గిరిజన మహిళలపై పెట్టిన కేసును ఎత్తి వేసి నిందితులను అరెస్ట్ చేయాలని సీఐకి ఇచ్చిన వినతిపత్రంలో కోరారు. బాధితులకు న్యాయం జరిగేంత వరకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. దాడిచేసిన వారిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసినట్లు సీఐ ఎం.సుబ్బారావు తెలిపారు. సీఐని కలిసి బాధితులను పరామర్శించిన వారిలో జేఏసీ అధ్యక్షుడు పేరం శ్రీనివాసరావు, కౌన్సిలర్ పాటిబండ్ల గంగయ్య, గిరిజన సంఘం, కేఎన్‌పీఎస్, సీపీఎం, ఎంఆర్‌పీఎస్ సంఘాల నాయకులు పేరం సత్యం, జంగాల కోటేశ్వరరావు, పిన్నిక శ్రీనివాసరావు, ఆరెతోటి రాంబాబు, చింతలపాలెం బాబు, ఇస్తర్ల శంకర్, తొట్టెంపూడి రామారావు, బత్తుల మల్లికార్జున ఉన్నారు.

ప్రకటన

నా క్లైంటు ... కోటేశ్వరరావు గారి కుమారుడు ... శ్రీనగర్ కాలనీ D.No.6-104A, ఒంగోలు ... యావన్మందికీ తెలియజేయునది.

... Reg. Sale Deed 27.06.2001 (D.No.750/2001) SRO: SNPadu ద్వారా కొనుగోలు చేసి ... 10 రోజులలో తెలుపగలరని తెలుపడమైనది.

షెడ్యూలు : ప్రకాశం జిల్లా, S.N.Padu Mandal - S.N.Padu SRO - ... గ్రామం S.No.181/1 - విస్తీర్ణము 40 గదుల ...

ఒంగోలు
తేది. 15.02.2025

R.V.S.Bharadwaja
Advocate
M.M.Road, Ongole.
Cell:94937 81705.

ప్రకటన

నా క్లైంటు ... కోటేశ్వరరావు గారి కుమారుడు ... శ్రీనగర్ కాలనీ D.No.6-104A, ఒంగోలు ... యావన్మందికీ తెలియజేయునది.

... Reg. విక్రయ పత్రం తేది.06.12.2005 D.No. 2741/2005 SRO: SNPadu ద్వారా కొనుగోలు చేసి ... 10 రోజులలో తెలుపగలరని తెలుపడమైనది.

షెడ్యూలు : ప్రకాశం జిల్లా, S.N.Padu Mandal - S.N.Padu SRO - ... గ్రామం S.No.181/1 - విస్తీర్ణము 40 గదుల ...

ఒంగోలు
తేది. 15.02.2025

R.V.S.Bharadwaja
Advocate
M.M.Road, Ongole.
Cell:94937 81705.





హరిబాబుకు చెందిన డీకే పట్టాభూమిలో అక్రమ బోర్ల ద్వారా ట్యాంకర్లకు నీటిని నింపుతున్న దృశ్యం

కొండపక్కన బోర్లు.. నిబంధనలకు నీళ్లు..!

ఒంగోలు నగరంలోని 31వ డివిజన్‌లో డీకే పట్టా భూముల్లో అక్రమంగా బోర్లు వేసి నీటిని తరలించి అమ్ముకుంటూ సొమ్ము చేసుకుంటున్నారు. విజయనగరకాలనీలోని కొండ పక్కన హరిబాబు, అంజయ్య అనే వ్యక్తుల డీకే పట్టా భూమిలో ఈ బోర్లు ఉన్నాయి. వాటి ద్వారా నిత్యం ట్యాంకర్లతో వందల ట్రిప్పులు వేస్తూ నీటిని తరలించి విక్రయిస్తున్నారు. ఇదంతా బహిరంగంగానే జరుగుతున్నప్పటికీ అధికారులు పట్టించుకోకుండా చోద్యం చూస్తున్నారు. అవినీతికి పాల్పడటం వలనే చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

- సాక్షి, ఒంగోలు


బోర్ నుంచి ట్యాంకుకు నింపిన నీటిని మోటార్ ద్వారా ట్యాంకర్‌కు నింపుతున్న దృశ్యం


అంజయ్యకు చెందిన డీకే పట్టా భూమిలో అక్రమంగా వేసిన బోర్ల నుంచి ట్యాంకర్‌కు నీటిని నింపుతున్న దృశ్యం




అంజయ్యకు చెందిన డీకే పట్టాభూమిలో అక్రమంగా వేసిన బోర్లకు అమర్చిన పైపులు

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలచిన వారు సంప్రదించండి.
ఒంగోలు డివిజన్
90102 24456, 90103 57744
90102 02762
Office mail : sakshiongads@gmail.com